# రెండు కన్నుల

పసుమర్తి 'ప్రణయకిరణ్'





"కలర్ బాక్స్ కొనమంటే కొన్నావు కాదు. చూడు ఇప్పుడు జిల్లా చిత్రలేఖన పోటీకి వెళ్లమని మా హెడ్ మాస్టర్‌గారు పంపించారు" అంటూ పరుగెట్టి వచ్చిన ఆయాసంతో గయ్ఁ మన్నాడు వాళ్లమ్మ మీద.

"ఎప్పుడురా? వెధవ గోల పెట్టక."

"ఎప్పుడేమిటి? ఇవాళే, ఇప్పుడే పదకొండు గంటలకి."

"అయితే నన్నేం చెయ్యమంటావురా?"

"కలర్ బాక్స్ కావాలి — కొను."

"ఎంత?"

"పద్దెనిమిది రూపాయలు. హెడ్ మాస్టర్‌గారి అబ్బాయి కొనుక్కున్నాడు."

"అంతకన్నా తక్కువలో ఏమీ రావా?"

"వస్తాయి కానీ ప్రైజే రాదు."

"ఖరీదు పెట్టి కొనేస్తే ప్రైజ్ వచ్చేస్తుందేమిటి? అబ్రహాం లింకన్ బొగ్గుతో చెక్క మీద రాసి అమెరికన్ ప్రెసిడెంటయ్యాడు." సర్ది చెప్పబోయింది తల్లి.

తల్లి మాటలు కొత్త కావు వాడికి. ఏమైనా కొనమని అడిగితే అబ్రహాం లింకన్ బొగ్గుతో చెక్కల మీద రాశాడనో, లాల్ బహదూర్ శాస్త్రి నది ఈదుకెళ్ళి చదువుకున్నాడనో అంటుంది. అలా అందంటే భూమి, నేల ఏకమైనా కొనదని లెక్కే.

అయినా ఈసారి మాత్రం వాడు అమ్మతో రాజీపడదల్చుకోలేదు. ఆఖరి ప్రయత్నంగా మరో రాయి విసిరాడు. "ఇది ఇలాటి అలాటి పోటీ కాదు. హెడ్ మాస్టరుగారి అబ్బాయి పెద్ద బాక్స్ పట్టుకొస్తాడు. వాడి దగ్గర మంచి రంగులు ఉంటాయి. కనీసం పద్దెనిమిది రూపాయల బాక్స్ అయినా లేకపోతే ఎలా వెళ్తానే?"

పిల్లాడు చెప్పినట్టు చెయ్యాలని ఉన్నా, చెయ్యి సాగని పరిస్థితి వాళ్లది. డబ్బులు లేక అబ్రహాం లింకన్, లాల్ బహదూర్ శాస్త్రి గురించి చెప్తుందావిడ. అలా చెప్పగానే ఈ గుంటడికి ఉక్రోషం తన్నుకొస్తుంది. అమ్మ మీద చెడ్డ కోపం వచ్చేస్తుంది. అందరి అమ్మలూ అడిగినవన్నీ కొనిపెడతారు. కానీ ఈ అమ్మే ఏమీ కొనిపెట్టదు. అమ్మకి తన మీద అభిమానం లేదని తీర్మానించేసుకుంటాడు. కానీ వాడి వయసుకూ, మనసుకూ అందని యదార్థం ఒకటుంది — "డబ్బు!" డబ్బు విలువగానీ, ఒక రూపాయి సంపాదించడానికి పడే కష్టంగానీ వాడికి తెలీదు.

బ్రహ్మాండంగా చదువుతున్నాడని రెండేళ్లు ఎక్కువేసి అయిదో క్లాసు నుండి ఏడో, క్లాసులో వేశారు. అది కూడా రెండేళ్లు ఫీజులు కట్టలేక. వాడి మీద వాళ్లమ్మ గారికున్న నమ్మకం అలాటిది. వాడితో అన్నీ బాగుంటాయి, కానీ గలివర్ ట్రావెల్స్, అరేబియన్ నైట్స్ మరేమైనా పుస్తకాలు కొనమనో పేచీ పెట్టేస్తుంటాడు. వీడికి ఇంగ్లీషు కథల పుస్తకాలు చదవడమన్నా, బొమ్మలు వేయడమన్నా మహాప్రాణం, వాళ్ల నాన్నగారు అలవాటు చేసినవి అవి.

ఈ గుంటడు చిన్నప్పుడు అన్నం ముద్దల్ని రామచిలకలాగో, బస్సులాగో, గ్యాస్ సిలిండర్‌లాగో చేస్తేకానీ తినే వాడు కాదు. "ఏమేవ్ వీడు పెద్ద ఇంజనీరో, ఆర్టిస్టో అయిపోతాడు" అని వీడి నాన్నగారు అంటుండేవారు. ఈ పిల్లాడికి మూడేళ్లు వచ్చిందగ్గర్నుంచి సుద్దముక్కలు పట్టుకుని ఇంటికి ఎవరొస్తే వాళ్లని బొమ్మలు గీసి ఇమ్మని చంపేస్తుండేవాట్ట. వాడింట్లో ఉన్నాడంటే ఇంటికి రావడానికి భయపడేవారు ఇంటికొచ్చే వారందరూ. వీడికి ఏడెనిమిది సంవత్సరాలు వచ్చేసరికి, ఎదురుగా మనిషి కూర్చుంటే ఆ మనిషిని యథాతథంగా గీసే నేర్పు పట్టుబడిపోయింది. ఆ నేర్పు వల్లే వాడిని స్కూల్ నుండి అంతర్ జిల్లా చిత్రలేఖనం పోటీకి పంపించదలిచారు.

ప్రతి స్కూల్ నుండి ఇద్దరిని పంపిస్తారు.




ఆమె : హేమా! నీది మలిచూపు ప్రణయం అని నీ స్నేహితుడి గురించన్నావు. మరి తొలి చూపు ప్రణయం ఎందుక్కాలేదో?
హేమ : తొలిచూపుల నాడు అతనంత డబ్బున్నవాడని నాకు తెలీనే తెలియదే!

అందులో ఈ పిల్లాడొకడు. ఇంకొకడు వాళ్ల హెడ్ మాస్టర్‌గారి అబ్బాయి సురేశ్. వాడూ, వీడూ చదువుతున్నది ఒకే తరగతి అయినా సురేష్ వీడికన్నా రెండేళ్లు పెద్ద. వాడిని చూస్తే ఈ గుంటడికి పక్క బెదురు. ఎందుకంటే వచ్చీరాగానే వీడి పక్కన కూర్చుని "ఏరా! పండక్కి కొత్త బట్టలు కుట్టించుకోలా, ఎప్పుడూ పాత బట్టలేనా? చూడు మా నాన్నగారు నాకు కాడ్రయ్ నిక్కరు, పాలీస్టరు షర్టు కొన్నారు." ఈ చిన్నవాడికి కళ్లమెయ్యా దుఃఖం వచ్చేస్తుంది, నోటంట మరి మాటరాదు. కానీ చదువు విషయం వచ్చేసరికి పులైపోతాడు. సురేశ్ ఎంత కష్టపడి చదివినా వీడికన్నా తక్కువ మార్కులు వస్తాయి. ఈ గుంటడు స్కూలు ఫస్టు. వీడి మార్కులు చూస్తే వాడికి సింహస్వప్నం. ఈ పిల్లాడితో చదవలేక 'ఏరా అవి కొన్లేదా, ఇవి కొన్లేదా' అని చులకన చేస్తూ ఉంటాడు. ఈ గుంటడు వాడికి సమాధానం చెప్పలేక అమ్మను అవీ ఇవీ కొనీమని బుర్ర దొలిచేస్తూంటాడు.

వీడికి పదేళ్లు. ఇంటిలో జరుగుతున్న విషయాలు ఆకళింపు చేసుకునే శక్తి లేదు. వీడి మనసు బాధ పెట్టడం ఇష్టంలేక ఇంటి విషయాలు వీడితో చెప్పదు ఆ తల్లి. బతికి చెడినవాళ్లు. ఈ పిల్లాడి నాన్నగారు ఉండుంటే, సురేశ్ తల్లితండ్రులకన్నా ఎక్కువ కొనిపెట్టేవారు. ఈ గుంట డొక్కదే దురదృష్టవంతుడు. వీడి ఆరో ఏటే వాళ్ల నాన్న గారిని గుండె నొప్పి హరించేసింది. అప్పట్నించి 'లా' కేత్వం 'ద'కి కొమ్ము ఇవ్వకుండా సంసారాన్ని నెట్టుకొస్తోందావిడ. ఈ గుంటడి మీద ఇద్దరన్నయ్యలు సంసారమనే సముద్రంలో స్వార్థమనే కెరటాల్లో పడి తలో దిక్కుకూ కొట్టుకుపోయారు.

పద్దెనిమిది రూపాయలంటే మాటలా. అవే ఉంటే వారం రోజులు సుఖంగా గడిచిపోతాయి. 'పోనీ వాడు ఏది అడిగినా కొనలేక పోతున్నాను, కనీసం బొమ్మలు వేసుకోడానికి రంగులు కొందామన్నా కొంగుకి రూపాయి నలభై పైసలు తప్ప మరేం లేవు' అనుకుంటూ —

"పోనీ తక్కువలో ఏమైనా ఉన్నా యేమో కనుక్కోరా కొంటాను" అంది.

"తక్కువలో నువ్వు నాకేం కొనక్కరలేదు. నాన్నగారుంటే కొనేవారు. నీ కసలు నా మీద ప్రేమ లేదు. నేనేం పోటీకి వెళ్లను" అంటూ ఏడుస్తూ పడుకున్నాడు.

ముప్పై ఏళ్లు కాపురం చేసిన భర్త పోయిన బాధ నుండి ఆవిడ ఇంకా తేరుకోనే లేదు. ఆయన చచ్చిపోగానే, ఆయన లేని జీవితాన్ని గడపలేక చచ్చిపోదామనుకున్న ఆవిడిని ఆపింది ఈ చంటివాడి ముక్కుపచ్చలారని ముఖం. 'వీడికి తండ్రి ఎలాగూ లేరు, నేను కూడా లేకపోతే వీడ్ని చూసే దక్షత ఉండదు' అని బతికిన ఆవిడకు ఈ గుంటడు అన్న మాటలు విద్యుత్ ఘాతంలా తగిలాయి.

అప్పటి వరకూ **గుండెల్లో దాచుకున్న** దుఃఖం అలలా ఉవ్వెత్తున ఎగిసి, విరిగి పడింది. ఆవిడకు తెలుసు ఈ గుంటడు కుంచె పెడితే తెల్లకాగితం రంగుల హరివిల్లు అయిపోతుందని!

వీడి మాట ఎలా ఉన్నా ఆ సురేశ్‌గాడు మాత్రం ఆవిడ పాలిట విలన్‌లా తయారయ్యాడు. 'వాడితో నీకెందుకురా' అంటే ఈ గుంటడు వినడు.

"నాయనా నా మాట వినరా! తర్వాత కొంటాను. ఈసారికి వెళ్లు నాయనా" అంది దుఃఖంతో పూడుకుపోయిన గొంతుతో.

"నేనేం వెళ్లను" విసురుగా లేచాడు.

అమ్మ కళ్లలో నీళ్లు.

తన కన్నీళ్లు అమ్మ తుడవడమేగాని, తల్లి కళ్లల్లో నీళ్లు ఎప్పుడూ చూళ్లేదు వాడు.

తను ఏడిస్తే అమ్మ ఊరుకోబెడుతుంది. కాని అమ్మే ఏడిస్తే?

వాడికేం చెయ్యాలో తెలీదు.

అంతవరకూ అమ్మమీద ఉండే కోపం కరిగి నీరయిపోయి వాడి కంటి నుండి ప్రవహించింది.

"అమ్మా! ఏడవకమ్మా! మరింకెప్పుడూ నిన్ను బాధపెట్టను. నేను పోటీకి వెళతానమ్మా రెండున్నర ఉంటే ఇవ్వు, చిన్న కలర్ బాక్స్ కొనుక్కుంటాను."


'ఉండు నాన్నా ఇప్పుడే వస్తా'నని కళ్లు తుడుచుకుని ఇరుగు పొరుగు వారింటికి వెళ్లి తన కొంగుకున్న రూపాయి నలభై పైసలు కాక మరో రూపాయి పది పైసలు సంపాదించి కొడుక్కిచ్చింది. వాడే పోటీకి వెళ్లినా, పరీక్ష కెళ్లినా, నాన్నగారి ఫోటోకీ, అమ్మకీ దండం పెట్టకుండా వెళ్లడు.

'అమ్మా! కాళ్లు పట్టమ్మా దణ్ణం పెడతాను' అన్నాడు.

"ముందు నాన్నగారి ఫోటోకు పెట్టు నాయనా, నీకు కనిపించకపోయినా నీ పక్కనే ఉంటారు."

అమ్మ చెప్పినట్టే చేసి బయటకు వెళ్లిపోయాడు.

"చూడండీ! మన సూరిబాబు జిల్లా స్థాయి




పోటీకి వెళుతున్నాడు" అని గట్టిగా అరిచినా వినబడనంత దూరతీరాలలో ఉన్న భర్త ఫోటో ఎదురుగా వాడికి ఏదో ఒక బహుమతి వచ్చేటట్టు చెయ్యమని వేడుకుంటూ, ఏడుస్తూ పడుకుంది ఆవిడ — అంతకన్నా ఏమీ చెయ్యలేక.

సూరిబాబు పోటీ జరిగే ప్రదేశానికి చేరుకున్నాడన్నమాటే గాని వాడి గుండెలు పీచుమంటున్నాయి — వాడెక్కడ ఎదురుపడతాడోనని. మెల్లిగా నక్కుతూ పోటీ జరిగే గది దగ్గర కెళుతుంటే.

"ఏరా కలర్ బాక్స్ కొన్నావా?" అంతే! వాడి పంచప్రాణాల్లో నాలుగు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఎవడు ఎదురుపడతాడని నక్కుతూ నడిచాడో వాడు వెనకాలే దాపురించాడు. వాడి చేతిలో పద్దెనిమిది రూపాయల కలర్ బాక్స్ మెరిసిపోతూంది.

"కొన్నాను."

"ఏదీ చూపించు."

"తర్వాత చూపిస్తాలే."

"ఏం? చూపిస్తే అరిగిపోతావా?"

ఈ గుంటడికి తక్కువ ఖరీదు కలర్ బాక్స్ చూపించడానికి నామోషీ. పోనీ, చూపించినా వాడు తిన్నగా ఉంటాడా? ఏదో ఒకటి అంటాడు. చూపించకపోతే వదలడు. అందులోనూ హెడ్ మాస్టర్‌గారి అబ్బాయి. చూపించక తప్పింది కాదు.

"ఓ! ఇదా! ఈ రంగులు మంచివి కావని మా డ్రాయింగ్ మాస్టరు చెప్పారు. బ్రష్‌లు కొన్నావా?"

"లేదు, ఈ బాక్స్‌లో చిన్నది ఉంది."

"ఇది బ్రంత బ్రష్షు, దీని ఈకలు ఊడిపోతాయి. ఏరా! ఈ బాక్స్‌తోనూ, బ్రష్‌తోనూ జిల్లా పోటీలో ప్రైజ్ కొట్టేద్దామని వచ్చేశావా? చూడు అందరూ కార్లలో వచ్చారు. వాళ్ల దగ్గర నా కన్నా మంచి రంగులు ఉన్నాయి తెలుసా?"

అసలే అమ్మ కళ్లల్లో నీళ్లు చూసి సగం దిగజారిపోయాడు. మిగతా సగం సురేష్‌గాడి మాటలు దిగజార్చేశాయి.

ఎప్పుడొచ్చారోగానీ సంస్కృతం మాస్టారు "ఒరేయ్ సురేశ్! నీ పని నువ్వు చూడరా; వీడికి ప్రైజ్ వస్తుందో, లేదో తీరిగ్గా ఆలోచిద్దువుగాని."

సమయానికి మాస్టారు అడ్డంపడ్డారుగాని వాడు ఇంకెన్ని అనేవాడో.

"సూరిబాబూ! వాడి మాటలు పట్టించుకోకురా. నువ్వెళ్లు అందరికీ తెల్లకాగితాలు ఇచ్చేస్తున్నారు.

సూరీబాబంటే ఆయనకెందుకో వల్లమాలిన అభిమానం. బహుశా వాడి ప్రవర్తనా, చదువు ఏమో!

"మాస్టారూ! నేను పోటీకి వెళ్లనండి. ఇంటికెళ్లిపోతాను" అన్నాడు.

"ఏరా?"

"నా దగ్గర మంచి రంగులు లేవు కదా, నాకు ప్రైజ్ రాదు" ఆ చిన్నారి కళ్లలో నిరాశ.

"అని ఎవరైనా చెప్పారట్రా నీకు? పూర్వం కవులు ఇప్పటివాళ్లలాగ తెల్ల కాగితాల మీద ఫౌంటెన్ పెన్నులతో రాశారట్రా? వాళ్లు మహాకవులు కాకుండా పోయారా! పోతన లాగ నువ్వు సహజ పండితుడివి. సురేశ్‌గాడిలాగ నేర్చుకున్నవాడివి కాదు. నీకు పోటీలో ఫస్ట్ ప్రైజ్ వస్తుంది. నా కా నమ్మకం ఉంది. పైగా ఫస్ట్ ప్రైజ్ ఏమిటో తెలుసా? సురేశ్‌గాడి దగ్గరున్న లాటి కలర్ బాక్సు, ఐదు మంచి బ్రష్‌లు."

మొదట మాస్టారు చెప్పిన మాటలు వాడి మీద అంతగా ప్రభావం చూపించలేదుగాని. ఆఖరి మాటలు మాత్రం ఇంటికి వెళ్లిపోదామనుకున్న వాడ్ని ఆపేశాయి.

"నిజంగా మాస్టారూ" ఆ కళ్లల్లో ఆశ...

మాస్టారి మాటల నైతిక బలం, పద్దెనిమిది రూపాయల కలర్ బాక్స్ మీద ఆశ వాడిలోని ఆత్మవిశ్వాసఅన్ని ఆకాశమంత ఎత్తుకు పెంచేశాయి.

కార్లలో వచ్చిన పిల్లల కొత్త కలర్ బాక్స్‌ల ధగధగలు తెల్ల కాగితం ముందు కూర్చున్న ఈ పిల్లాడు ఏకాగ్రత ముందు వెలవెల పోయాయి.

తల్లిదండ్రుల ప్రేమ సురేశ్‌కి ఖరీదైన కలర్ బాక్స్ కొనిపెడితే ఏమీ కొనలేని ఆ తల్లి ప్రేమ చతుర్ముఖుని తన వీణానందంతో ఆనందపరుస్తున్న సరస్వతీ దేవిని పట్టుకొచ్చి పోటీలో బొమ్మ గీస్తున్న తన కొడుకు చేతి మీద కూర్చోపెట్టింది.

అందరి పిల్లల దగ్గరున్న తెల్లకాగితాలు రంగులు నింపుకుంటుంటే ఈ పిల్లాడి కాగితం మీద మాత్రం పల్లె వాతావరణం జీవాన్ని నింపుకుంటోంది.

"సూరిబాబున్నాడండీ" వచ్చింది వెంకట్రావనే స్నేహితుడు.

"పెరట్లో ఉన్నాడు బాబు! ఏమిఁ?" అందావిడ.

"సూరిబాబుకి చిత్రలేఖనం పోటీలో ప్రథమ బహుమతి వచ్చిందండీ. హెడ్ మాస్టారు చెప్పమన్నారు."

ఇంతట్లో సూరిబాబు వచ్చాడు. "నిజంగానా! పోరా అబద్ధాలు చెప్పకు." ఎందుకో వాడికి నమ్మకంగాను, అపనమ్మకంగాను ఉంది.

"నిజంగానేరా! అమ్మతోడు! నాలుగు గంటలకి కోటలో బహుమతి ప్రదానం ఉంది. నిన్ను తీసుకురమ్మన్నారు."

"ఇప్పుడే ముఖం కడుక్కుని వచ్చేస్తానుండు" అని పెరట్లోకి పరిగెట్టాడు.

ఆ తల్లి మనసు అంబారీ ఎక్కినంత ఆనందపడింది. తనకే మొదటి బహుమతి వచ్చినంత గర్వపడింది.

"అమ్మా నువ్వూ రామ్మా."

"నేనెందుకు నాయనా? నువ్వు వెళ్లు" అంది.

"నువ్వెప్పుడూ అంతేనమ్మా, నేనేం చెప్పినా చెయ్యవు. నువ్వు రాకపోతే నేనూ వెళ్లను అంతే."

బయల్దేరక తప్పింది కాదావిడకు.

ఎందరో గొప్పవాళ్ల మధ్య ఆ రోజు హీరో అయిపోయాడు తన కన్న కొడుకు. మాస్టార్లు, పిల్లల అభినందనలు, కరతాళ ధ్వనుల మధ్య తన కొడుకు విద్యా శాఖా మంత్రి నుండి యోగ్యతా పత్రం, వాడి కలల రాణి పద్దెనిమిది రూపాయల కలర్ బాక్స్ తీసుకుంటుంటే పిల్లాడి ముఖంలో మెరుపు చూసిన ఆ తల్లి కళ్లలో ఆనందబాష్పాలు మురిని ముత్యాలైపోయాయి.

ఆ గుంటడిప్పుడు ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో పెయింటింగ్ ప్రొఫెసర్. వాడికొచ్చిన గోల్డ్ మెడల్స్ మధ్య ఇప్పటికీ పెద్ద పీటేసుకుని కూర్చుని ఉంది వాళ్లమ్మ కొన్న రెండున్నర కలర్ బాక్స్. ◆